ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.5050) | 503.50 (120.8990) | నిల్ | 9,168 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 641.25 (3.47) | 2,235.74 | నిల్ |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 101.57 (0.90) | 439 | నిల్ |

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.222





# మోదం.. ఖేదం

కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నిరాశ మిగిల్చింది. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేస్తుందని ఆశించినా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మోదం, ఖేదం కలిగించింది. నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో మధ్య తరగతి ప్రజలకు ఏ మాత్రం ఊరట కలిగించలేదు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణకు గతంలోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పార్లమెంటు సభ్యులు పలు ప్రతిపాదనలు పెట్టినా, కేంద్ర ప్రభుత్వం ఎప్పటి మాదిరిగానే మొండిచేయి చూపింది. కేంద్రం నుంచి ఎలాంటి వరాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు నిరాశకు గురయ్యారు.

- నల్లగొండ

- వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట
- పట్టణాల్లో ఇళ్ల కోసం మరోసారి కేటాయింపులు
- కాగితాలకే పరిమితం అవుతున్న సోలార్ ఉచిత విద్యుత్
- ముద్ర రుణాల పరిమితి పెంచుతూ నిర్ణయం
- ఉన్నత విద్యకు రుణాల కేటాయింపు అరకొరే
- ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు నిరాశే

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, అనుబంధరంగాలకు పెద్దపీట వేసింది. వ్యవసాయంపై 70శాతం ప్రజలు ఆధారపడి ఉన్న నేపథ్యంలో ఈ రంగానికి కేటాయింపులు చేశారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించేందుకు నిధులు భారీగా ఇచ్చింది. వరి, పత్తితో పాటు పండ్లతోటల పెంపకం, మత్స్య సంపద, పశుసంవర్ధకశాఖ, సెరికల్చర్‌శాఖలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 9.50లక్షల మందికిపైగా రైతులు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారు. ఏటా ప్రకృతి వైపరీత్యా లు, తెగుళ్ల సమస్యలతో రైతులు నష్టపోతున్నారు. దీంతో బీమా సౌకర్యాన్ని కల్పించి పంట నష్టపోతే రైతులను ఆదుకునేలా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసింది.

### రూ.20లక్షల వరకు 'ముద్ర' రుణాల పెంపు

కేంద్ర ప్రభుత్వం ముద్ర యోజన కింద చిన్నతరహా వ్యాపారాలు చేసుకునే వారికి రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు సాయం పెంచుతూ బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఎలాంటి హామీ లేకుండానే ముద్ర రుణాలు ఇవ్వనుంది. ఈ పథకం ద్వారా చిన్నతరహా వ్యాపారాలు చేసుకునే వారికి ప్రయోజనం చేకూరనుండగా, రుణాన్ని రూ.20లక్షలకు పెంచింది. మహిళలు గ్రూపులు ఏర్పడి వ్యాపారం చేసుకునేందుకు ఈ రుణం ఉపయోగపడనుంది. మహిళల ఆర్థిక బలోపేతానికి కేంద్రం ముద్ర యోజనను మరింత పకడ్బందీగా అమలు చేయనుంది.

### ఉన్నత విద్యకు అరకొర కేటాయింపులే



ఉన్నత విద్యను అభ్యసించాలనుకున్న పేద మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నిరాశే మిగిల్చింది. లక్షలాది రూపాయలు ఫీజులు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం రూ.10లక్షల వరకు రుణాలు ఇస్తాననడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. విద్యా రుణాలు పెంచితేనే విదేశాల్లో విద్యను అభ్యసించే వారికి ప్రయోజనం చేకూరుతుంది. ఉన్నత విద్య అభ్యసించాలని ఆశించే వారికి రుణాలు ఇవ్వకుండా బ్యాంకర్లు తిప్పుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సరైన ఆలోచన చేయకుండా రుణాలను రూ.10లక్షలకే పరిమితం చేసిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిట్టూరుస్తున్నారు. ఉన్నత విద్య కోసం కనీసం రూ.30లక్షల వరకు రుణపరిమితి కేటాయిస్తే ఉన్నత విద్యను అభ్యసించే వారికి ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

### పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం



పట్టణ ప్రాంతాలల్లో అర్బన్ హౌసింగ్ స్కీం కింద గత బడ్జెట్ మాదిరిగానే నిధులు కేటాయించింది. ఈ పథకం కింద ఇంటిని నిర్మించుకునే వారికి సుమారు రూ.2.65లక్షలు ఇవ్వనుంది. బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఇంటిని నిర్మించుకునే వారికి ఈ మొత్తాన్ని కేంద్రం రుణదారుడి ఖాతాలో జమ చేస్తుంది. ప్రతీ వ్యక్తికి సొంత ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో కేంద్రం ఈ నిధులను కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ బ్యాంకుల నుంచి ఇంటి రుణాలు పొందిన వారికి ఈ పథకం ఉపయోగపడనుంది.

### సోలార్ ఉచిత విద్యుత్ ఉత్తదేనా



సోలార్ ప్యానళ్ల ద్వారా ఉచిత విద్యుత్ అందజేస్తామని కేంద్రం మరోసారి ప్రకటించడం ప్రతీ ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సబ్సిడీపై సోలార్ ప్యానళ్లు ఇచ్చి ఉచితంగా 300 యూనిట్ల వరకు గృహాలకు విద్యుత్ పొందవచ్చని ప్రకటించింది. అయితే ఉమ్మడి జిల్లాలో ఈ పథకం ముందుకు సాగలేదు. విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు మిగిలిన సోలార్ విద్యుత్‌ను కొనుగోలు చేస్తామని నాడు కేంద్రం ప్రకటించింది. అయితే ఈ పథకాన్ని వర్తింపజేయడంలో అధికారులు వైఫల్యం చెందడమేగాక ప్రజల్లో కూడా అవగాహన కల్పించలేక పోయారు. కేంద్ర ప్రభుత్వం మరోసారి ఈ పథకాన్ని కాగితాలకే పరిమితం చేసేలా ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాకు నిరాశే

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వివిధ అభివృద్ధి పనులను ప్రతిపాదించినా వాటిని మోక్షం కలగలేదు. భువనగిరి-రాయిగిరి ఎనిమిది లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌తో పాటు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు ఎలాంటి కేటాయింపులు జరగలేదు. 100 మొబైల్ వెటర్నరీ యూనిట్లను కూడా తిరిగి ఇవ్వాలని ప్రతిపాదించినా, కేంద్రం కనికరించలేదు. దీంతో పశువైద్యంపై తీవ్ర ప్రభావం పడనుంది. కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేసిన వారికి సాఫ్ట్‌వేర్ శిక్షణ ఇచ్చినా, ఈ సారి కూడా స్టైఫండ్ రాలేదు. అర్బన్ ప్రాంతాల్లో ఇళ్లకు కేంద్రం నిధులు ఇస్తున్నప్పటికీనీ ఇందిరమ్మ ఇళ్లను పీఎంఏవైకి అనుసంధానం చేయాలని కోరినా ఆ వైపుగా చర్యలు తీసుకోలేదు. యాదాద్రి జిల్లాలో ఇండస్ట్రియల్ పార్క్, దండుమల్కాపురంలో ప్లాంటెడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. సూర్యాపేట, యాదాద్రి జిల్లాలకు జవహర్ నవోదయ పాఠశాలలు మంజూరు చేస్తారని ఆశించినా, నిరాశే మిగిలింది. కీలకమైన మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కూడా నిధులు సమకూర్చలేదు. సీసీఎంబీని భువనగిరి పరిధిలోని బొమ్మాయపల్లిలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు చుక్కెదురైంది.





# వ్యవసాయరంగానికి అంతంతే

- బడ్జెట్‌లో స్వల్పంగా పెరిగిన నిధులు
- అందులో వడ్డీలకు రూ.12లక్షల కోట్లు పోతాయంటున్న నిపుణులు
- ఉత్పాదకత, సాంకేతికత పెంచేందుకు నిధులు కరువు

**మోత్కూరు, జూలై 23:** కేంద్ర బడ్జెట్ రైతు సంక్షేమ బడ్జెట్‌గా చెబుతున్నా, వ్యవసాయరంగంలో సంక్షోభమే తప్ప సంక్షేమం కొరవడిందని రైతు సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు.2023-24 బడ్జెట్‌లో వ్యవసాయానికి కేంద్రం రూ.44.42లక్షల కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.48.20లక్షల కోట్లు మాత్రమే ఇచ్చింది. బడ్జెట్ అంకెల్లో నిధులు పెరిగినట్టు ఉన్నా, అందులో రూ.12.08లక్షల కోట్లు వడ్డీలకే వెళ్తాయని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.అవసరమైతే అందులోంచి అసలు కూడా చెల్లించాల్సి రావచ్చంటున్నారు. ఎరువులపై సబ్సిడి రూ.లక్ష కోట్లు కేంద్ర ప్రభుత్వం కోత పెట్టింది. వ్యవసాయాభివృద్ధి 4.7శాతం నుంచి 1.4శాతానికి పడిపోయిందని ఎకనమిక్ సర్వే చెబుతున్నా ఈ రంగంలో ఉత్పత్తిని పెంచడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలేవీ కన్పించడం లేదు.పంటల ఉత్పత్తులను, వ్యవసాయానికి అవసరమైన సాంకేతికతను ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నామే తప్ప స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమై నిధులు కేటాయించడం లేదు. ఇరిగేషన్‌కు రూ.30,233కోట్లు, ఫసల్‌బీమా యోజనకు రూ.14,600కోట్లు, వడ్డీ మాఫీకి రూ.22,600 కోట్లు, కిసాన్ సమ్మాన్ యోజనకు రూ.60,000కోట్లు, ఆర్‌కేవీవైకి రూ.7,533కోట్లు కేటాయించారని, ఈ నిధులు ఏమాత్రం సరిపోవని నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయ పరిశోధనలకు రూ.9,441కోట్లు కేటాయించినా, అందులో రూ.5,600కోట్లు మాత్రమే పరిశోధనలకు వ్యయం కానుండగా, మిగతా నిధులు నిర్వహణకే (అడ్మినిస్ట్రేషన్) వ్యయం కానుంది.

### ఉత్పత్తి పెంచే చర్యలేవీ?

చైనా 33కోట్ల ఎకరాల్లో 80కోట్ల టన్నులు, అమెరికా 36కోట్ల ఎకరాల్లో 60కోట్ల టన్నుల ఉత్పత్తి సాధిస్తుండగా, మన దేశంలో 46కోట్ల ఎకరాల్లో 32కోట్ల టన్నుల పంటల ఉత్పత్తి మాత్రమే సాధిస్తున్నాం. మన దేశంలో ఎకరాకు 2,200కిలోల పంట ఉత్పత్తి వస్తుండగా, దాన్ని 4వేల కిలోలకు పెంచాల్సిన అవసరం ఉంది. అందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించి, తగిన చర్యలు తీసుకోనప్పుడు ఉత్పత్తి పెంపు ఎలా సాధ్యమవుతుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

### ఐదు శాతం నిధులు వ్యవసాయరంగానికి కేటాయించాలి



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 3.4శాతం నిధులు మాత్రమే కేటాయిస్తోంది. కనీసం ఐదు శాతం నిధులైనా కేటాయించాలి. దేశంలో 14.57కోట్ల రైతు కుటుంబాలు ఉండగా, ఇప్పుడు 8కోట్ల రైతు కుటుంబాలకే పీఎం కిసాన్ సమ్మాన్ యోజన అందుతోంది. ఇది అందరికీ ఇవ్వాలి. బడ్జెట్‌లో అంకెల గారడీ చేయకుండా వాస్తవ పద్దులు చూపాలి. కేటాయించిన బడ్జెట్ పూర్తిగా ఆయా రంగాలకు ఖర్చు చేయాలి. వ్యవసాయరంగంలో ఉత్పత్తి, సాంకేతికత పెంచేందుకు అవసరమైన నిధులు ఇవ్వాలి.ఎన్నికల ముందు చెప్పినట్టుగా కేంద్రం రైతుల సంక్షేమానికి కట్టుబడాలి.

- సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



# రోడ్డునపడనున్న నేతన్న

- కేంద్ర బడ్జెట్‌లో తగ్గిన నిధులు
- కేటాయింపులు ఉద్యోగుల జీతభత్యాలకే సరి

**మోత్కూరు:** దేశంలో వ్యవసాయం తరువాత రెండో ప్రధానరంగమైన చేనేతకు చేయూత ఇవ్వాల్సిన మోదీ సర్కారు ఈ సారి బడ్జెట్‌లో నిధులు తగ్గించి నేతన్న నడ్డి విరిచింది. ప్రస్తుత బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.200 కోట్లు మాత్రమే ఇచ్చింది. గడిచిన ఐదారేళ్లలో ఏ బడ్జెట్‌లోనూ చేనేతరంగానికి ఇంత తక్కువ నిధులు కేటాయించలేదు. గత ఏడాది బడ్జెట్‌లో రూ.250 కోట్లు ఇవ్వగా, ఈ ఏడది రూ.50కోట్లు తగ్గించారు. దేశంలో 1.83కోట్లు, రాష్ట్రంలో సుమారు 60వేల కుటుంబాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 15వేల కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇప్పటికే చేనేత కార్మికులకు పని లేక, నేసిన వస్త్రాలు విక్రయంకాక అర్థాకలితో అలమటిస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చేనేత సంక్షేమ పథకాలు అంతంత మాత్రంగానే అమలవుతున్నాయి. దేశవ్యాప్తంగా చేనేతకు రూ.200కోట్లు మాత్రమే కేటాయించడంతో కొత్త సంక్షేమ పథకాలు రాక పోగా, గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు కూడా మంగళం పాడే ప్రమాదం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం చేనేతకు కేటాయించిన బడ్జెట్ ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోనుంది. చేనేతకు తక్కువ నిధులు కేటాయించిన ప్రభుత్వం టెక్స్‌టైల్ రంగానికి మాత్రం నిధులు పెంచింది. టెక్స్‌టైల్ రంగానికి గత ఏడాది బడ్జెట్‌లో రూ.2,158 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.2,432కోట్లకు పెంచారు. చేనేత రంగానికి నిధులు తగ్గించడంతో కార్మికులు రోడ్డున పడతారని చేనేత సహకారం సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేనేత రంగాన్ని దెబ్బతీస్తున్న టెక్స్‌టైల్ రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచడం కార్పొరేట్‌ను ప్రోత్సహించడమేనని పలువురు విమర్శిస్తున్నారు. బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఉపాధి, కనీస వేతనాల ఊసే లేదు. చేనేతకు రిజర్వ్ అయిన 11 రకాల వస్త్రాలను మిల్లుల్లో తయారు చేయకుండా అజమాయిషీ చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వం పరోక్షంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### చేనేతను చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం



జియో ట్యాగింగ్ పేరుతో జిల్లాలో, రాష్ట్రంలో చేనేత మగ్గాలను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో గత సంవత్సరం కంటే రూ.50కోట్లు తగ్గించి ఈ రంగాన్ని చిన్నచూపు చూసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 15వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటికే వారికి పనిలేక బతుకుదెరువు కోసం వలసలు పోతుండగా, కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో చేనేతకు చేయూతనివ్వకపోవడంతో కార్మికుల పరిస్థితి మరింత దిగజారిపోనుంది. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి చేనేత కార్మికులను ఆదుకునేలా బడ్జెట్‌లో నిధులు పెంచాలి.

- కూరపాటి రమేష్, చేనేత కార్మిక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ సంఘంతోనే సాధ్యం

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ సభ్యుడు గుడిపాటి కోటయ్యకు తొలిగా సభ్యత్వం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

**మిర్యాలగూడ, జూలై 23:** ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమంకోసం అనేక జీవోలు విడుదల చేయించిన ఘనత పీఆర్‌టీయూదేనని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బకల్‌వాడీ పాఠశాల, తుంగపహాడ్ ఆదర్శపాఠశాలలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ సభ్యుడు గుడిపాటి కోటయ్యకు తొలిగా సభ్యత్వ రశీదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వాన్ని ఒప్పించి ఇప్పించడంలో పీఆర్‌టీయూ పాత్ర కీలకమన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ గతంలో మెరుగైన పీఆర్‌సీని సాధించడంలో సంఘం చేసిన కృషి ఉపాధ్యాయులందరికీ తెలుసన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, భిక్షంగౌడ్, నర్సింహారెడ్డి, నర్సింహ నాయక్, లక్ష్మణ్ నాయక్‌లు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**నకిరేకల్:** ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. నకిరేకల్‌లో జడ్పీహైస్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, మేకల జానారెడ్డి, భాస్కర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సునీల్, లఘుశెట్టి సత్యనారాయణ, కంపల యాదయ్య పాల్గొన్నారు.

**తిప్పర్తి:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సం ఘం పీఆర్‌టీయూ అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేజీబీవీ, మోడ ల్ పాఠశాలలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ జిల్లా అధ్యక్షుడు భిక్షం గౌడ్, మేకల జానారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి మహేందర్‌రెడ్డి, నాగభూషణాచారి, తరాల జగదీష్, ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ, నర్సింహానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

- విద్యార్థులకు జీవిత పాఠాలు బోధించిన కలెక్టర్
- పాఠశాలలు, ఆస్పత్రులు శుభ్రంగా ఉంచాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో పాటు బెంచీపై కూర్చుని డిజిటల్ పాఠాలు వీక్షిస్తున్న కలెక్టర్

**నార్కట్‌పల్లి, జూలై 23:** చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి రైతు రుణమాఫీపై ఆరా తీశారు. నార్కట్‌పల్లి, బీ.వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి పచ్చదనాన్ని ఆస్వాదించారు. మొత్తం నాలుగు గంటల పాటు నార్కట్‌పల్లి మండలంలోనే ఆయన గడిపారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులకు జీవిత పాఠాలు బోధించారు.

### రోగులు ఆర్‌ఎంపీల వద్దకు ఎందుకు వెళ్తున్నారు

తొలుత నార్కట్‌పల్లి పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఉన్న బెడ్‌లు, ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించారు. హాజరు రిజిస్టర్ ఆధారంగా పేర్లు చదువుతూ సిబ్బంది హాజరును స్వయంగా తనిఖీచేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెంచాలని, ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగికి సెలవే తప్ప గైర్హాజరనేదే ఉండొద్దని చురకలంటించారు.

### వివరాలతో కూడిన జాబితా పెట్టాలి

కలెక్టర్ నారాయణరెడ్డి స్థానిక ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించారు. రైతు రుణమాఫీ తీరును నోడల్ అధికారి ద్వారా తెలుసుకున్నారు. బ్యాంకుకు వచ్చిన రైతులను రుణమాఫీ జరిగిందా అని ప్రశ్నించారు. రుణమాఫీ వర్తించినా డబ్బులు జమకాకుంటే అందుకు గల కారణాలను పేర్కొంటూ వివరాలతో కూడిన జాబితా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.

### డిజిటల్ పాఠాల తీరుపై అసంతృప్తి

నార్కట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తొలుత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డిజటల్ పాఠాలపై విద్యార్థులను ప్రశ్నించారు. వారిచ్చిన సమాధానంతో కలెక్టర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు రెండు కంప్యూటర్లు, తరగతి గదులకు మరమ్మతులకు నిధులు, ప్రహరీ ఎత్తు పెంపునకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు.

### వీడీసీలు ఏర్పాటు కావాలి

బీ.వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఈ పాఠశాల జిల్లాలోని ఇతర పాఠశాలలకు 'రోల్ మోడల్' కావాలని ఆకాంక్షించారు. ఇందుకు గ్రామాల్లో వీడీసీ (విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)లు ఏర్పాటు కావాలని సూచించారు. అందుకు జిల్లాలోనే మొదట బీవెల్లెంల నుంచే నాంది పలకాలని ప్రోత్సహించారు. నిజామాబాద్ జిల్లాలో కొన్ని గ్రామాల్లో వీడీసీలు చాలా శక్తిమంతంగా పనిచేస్తున్నాయని ఉదాహరించారు. ఆగస్టు 15లోగా ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులను వెనక్కి రప్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే గ్రామానికి మూడు స్కూల్ బస్సులను ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. 10వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో పాటు కూర్చుని డిజిటల్ పాఠాలను వీక్షించారు. ఏకరూప దుస్తుల రెండో జతను అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బియ్యం నాణ్యతపై ఏజెన్సీ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా స్వయంగా బియ్యం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. బీ.వెల్లంల రిజర్వాయర్ పక్కన బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో డీఈవో బొల్లారం భిక్షపతి, డీఆర్డీవో నాగిరెడ్డి, పీఆర్ ఈఈ భూమన్న, డీఈఈ మహేశ్, ఎంపీడీవో ఉమేశ్‌చారి, నాయకులు బత్తుల ఊశయ్య, బొడిగె నర్సింహ, సైదులు, నల్లబోతు వెంకన్న, ఎంఈవో నర్సింహ, పీఆర్ ఏఈ మోహన్ పాల్గొన్నారు.

# పరిహారం, పునరావాసం కల్పించాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



గొట్టిముక్కల రిజర్వాయర్‌ను పరిశీలించి ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, తదితరులు

**దేవరకొండ, డిండి, మర్రిగూడ జూలై 23:** డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ల కింద భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండ మండలం గొట్టిముక్కలలో కొనసాగుతున్న గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణ పనులను రంగారెడ్డి ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ 2015లో కేసీఆర్ శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేస్తానని చెప్పారన్నారు. ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పిస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలన్నారు.

### బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

బడ్జెట్‌లో నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. డిండి ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన ఐదు రిజర్వాయర్‌లను సీపీఐఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డిండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో డిండి ఎత్తిపోతల, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని తెలిపారు. అనంతరం మర్రిగూడ మండలంలోని చర్లగూడ రిజర్వాయర్, నాంపల్లి మండలంలోని లక్ష్మణాపురం రిజర్వాయర్ పనులను సీపీఎం బృందం పరిశీలించింది. కార్యక్రమాల్లో నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కంభాలపల్లి ఆనంద్, నారి ఐలయ్య, మల్లేష్, బండ శ్రీశైలం, ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, నర్సిరెడ్డి, చంద్రమౌళి, పాల్గొన్నారు.

# నేడు సాగర్‌లో 'మీట్ యువర్ ఎస్పీ'



ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నాగార్జునసాగర్, జూలై 23:** ప్రజా సమస్యల పరిష్కారంకోసం బుధవారం సాగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు తమ ఫిర్యాదులను తక్షణమే పోలీస్ స్టేషన్‌లోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు ఉదయం 10 గంటల నుంచి తమ ఫిర్యాదులను సాగర్ పోలీస్‌స్టేషన్‌లో స్వయంగా ఎస్పీకి అందజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## హైనా దాడిలో రెండు దూడలు మృతి

**డిండి, జూలై 23 :** హైనా దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా డిండి మండలం కొత్తతండా వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు మోతీలాల్, అటవీశాఖ అధికారి సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మోతీలాల్ తన వ్యవసాయ పొలం వద్ద గేదెలను కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి హైనా దాడి చేసి రెండు గేదె దూడలను హతమర్చిందని తెలిపారు.

## క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ప్రధానాలయంలో నిత్యకల్యాణపర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

**భువనగిరి అర్బన్, జూలై 23 :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణిలో వద్ద ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులకు నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలోనూ నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయం ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్యరుద్రహవనం కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.9,62,992 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఆలయ ఉప ప్రధానార్చకుడు కొడకండ్ల మాధవాచార్యులు బంధువులు, హైదరాబాద్‌కు చెందిన హరిప్రసన్నశ్రీవాణీ, సుషేణాచార్యులు కొండకింద సంస్కృత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర సామాగ్రి అందజేశారు.

### పటేల్, పట్వారీ వ్యవస్థ ఉంటే

## భూసమస్యలు వచ్చేవి కావు

● రాజ్యసభ మాజీ సభ్యుడు వీ హన్మంతరావు



సూర్యాపేటలో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు హన్మంతరావు

**సూర్యాపేట టౌన్, జూలై 23:** పటేల్, పట్వారీ వ్యవస్థ ప్రస్తుతం ఉంటే భూసమస్యలు వచ్చేవి కావని రాజ్యసభ మాజీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు(వీహెచ్) అన్నారు. వారసత్వంగా వచ్చిన భూమిని రెవెన్యూ అధికారులు తమ పేరున పట్టా చేయడం లేదని ఆరోపిస్తూ సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన అరుణ, ఆమె కుటుంబ సభ్యులు లక్ష్మమ్మ, పుల్లమ్మ సూర్యాపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'లో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఆ మహిళలను రామాపురం గ్రామంలో వీహెచ్ మంగళవారం పరామర్శించారు. అనంతరం సూర్యాపేటలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామాపురం గ్రామానికి చెందిన రైతు మేడం ముత్తయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిని 2016నుంచి ఇతరులు కబ్జా చేయడం బాధాకరమన్నారు. రైతుకు వచ్చిన భూసమస్య విషయంలో అప్పటి రెవెన్యూ అధికారులదే పూర్తి బాధ్యత అని అన్నారు. 'ధరణి' లోపాలను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వ హయాంలో నాయకులు, అధికారులతో కలిసి పలు అక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'ధరణి'ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ తాను ఉంటానని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, గోదాల రంగారెడ్డి, కోతి గోపాల్‌రెడ్డి, ధరావత్ వీరన్ననాయక్, మల్లేష్, చిరువేళ్ల శబరి, గండూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాగర్జునసాగర్ ఎడమకాల్వపై ఏర్పాటుచేసిన పెద్ద దేవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్ల మరమ్మతుల్లో నెలకొన్న తీవ్రజాప్యం అధికారులకు, ముంపు గ్రామాల ప్రజలకు ఆందోళన పుట్టిస్తోంది. రిజర్వాయర్‌కు వరద పోటెత్తిన పరిస్థితుల్లో ఎత్తాల్సిన ఎమర్జెన్సీ(సర్‌ప్లస్) గేట్లు 20 ఏళ్ల నుంచి పనిచేయకపోవడం ప్రభుత్వ, ఎన్నెస్పీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. నాలుగేళ్ల కిందట వరద పోటెత్తినప్పుడు రాత్రింభవళ్లు ఆందోళనతో కాల్వల వెంబడి పరుగులపెట్టిన అధికారులు రెండేళ్ల కిందట చేపట్టిన గేట్ల మరమ్మతుల పనులు గుత్తేదారు సకాలంలో పూర్తి చేయకపోవడంతో కురుస్తున్న వర్షాలతో అధికారుల, పరిసర ప్రాంత ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది.

- మిర్యాలగూడ

# 'పెద్ద' గండమే

- తెరుచుకోని బ్యాలెన్సింగ్ పెద్దదేవులపల్లి రిజర్వాయర్ రెగ్యులేటరీ గేట్లు
- 20 ఏళ్లుగా పనిచేయని ఎమర్జెన్సీ గేట్లు
- మరమ్మతుల్లో తీవ్రజాప్యం
- భారీ వరదొస్తే ముంపు ప్రమాదం



20 ఏళ్లుగా పనిచేయని రిజర్వాయర్ సర్‌ప్లస్(ఎమర్జెన్సీ) గేట్లు

నాగార్జునసాగర్ ప్రధాన ఎడమకాల్వపై 42వ మైలురాయివద్ద త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి వద్ద 2,250 ఎకరాల విస్తీర్ణంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఏర్పాటుచేశారు. రిజర్వాయర్‌పైన ఎడమకాల్వకు ఇన్‌ఫాల్‌కు మూడు గేట్లు, అవుట్ ఫాల్‌కు మూడుగేట్లు ఏర్పాటుచేశారు. ఎడమ కాల్వకు నీటివిడుదల జరుగుతున్న సమయంలో అత్యవసర పరిస్థితుల్లో దిగువకు కాల్వ నీటిని నిలిపివేయడానికి, ప్రాజెక్టు వద్ద కాల్వకు నీటివిడుదల చేయగానే రిజర్వాయర్ నుంచి నీరువిడుదల చేసి నెమ్మదిగా వాటర్‌ఫ్లోను పెంచడం కోసం ఈ రిజర్వాయర్‌ను నిర్వహిసున్నారు. 0.8338 టీఎంసీల నీటిసామర్థ్యం గల రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన డీ-1, డీ-2 కాల్వల ద్వారా 600 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. మిర్యాలగూడ పట్టణానికి తాగు నీరు అందించేందుకు రెండు ఇంటెక్‌వెల్స్‌ను, త్రిపురారం, నిడమనూరు, హాలియా మండలాలకు మిషన్ భగీరథ నీరు అందించేందుకు వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ఈ రిజర్వాయర్ నుంచే మంచినీరు సరఫరా చేస్తున్నారు.



పెద్దదేవులపల్లి రిజర్వాయర్

### 20 ఏళ్లుగా పనిచేయని ఎమర్జెన్సీ గేట్లు

పెద్దదేవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా పెద్దది కావడంతో భారీ వర్షాలకు వరద పోటెత్తినప్పుడు గేట్లు ఎత్తి నీటిని తుంగపాడు వాగులోకి వదిలివేయడానికి ఎనిమిది ఎమర్జెన్సీ గేట్లను ఏర్పాటుచేశారు. చౌటుప్పల్ పరిసర ప్రాంతాలు, పానగల్ చెరువు నుంచి సుమారు 18చెరువులకు పైగా వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. వరద ఉధృతికి రిజర్వాయర్ కట్టలు తెగి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా సుమారు 45వేల క్యూసెక్కుల పరిమాణం కలిగిన తుంగపాడు వాగులోకి నీరు వదలడానికి ఏర్పాటుచేసిన ఈ సర్‌ప్లస్ గేట్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో 20ఏళ్ల నుంచి పనిచేయడంలేదని ఆరోపిస్తున్నారు. గేట్లకు విద్యుత్ సరఫరా సౌకర్యం లేదని, జనరేటర్ సౌకర్యం కూడా లేనట్లు తెలుస్తోంది. 2002లో గేట్లు ఎత్తడానికి, దించడానికి ఉపయోగపడే గేరుబాక్స్‌లు చోరీకి గురైనట్లు సమాచారం.

### నాలుగేళ్ల కిందట తప్పిన పెనుముప్పు

2020 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్‌కు వరదనీరు పోటెత్తింది. 18వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. సర్‌ప్లస్ గేట్లు తెరుచుకోకపోవడంతో అధికారులలో ఆందోళన మొదలైంది. అంతకంతకూ వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి సీఈ అనుమతితో ఎన్నెస్పీ అధికారులు రిజర్వాయర్ అవుట్‌ఫాల్, ఇన్‌ఫాల్ ద్వారా నీరు వదిలివేయడమే కాకుండా తడకమళ్ల వద్ద ఎస్కేప్ గేట్లు తెరిచి మూసీ నదిలోకి నీటిని వదిలారు. రిజర్వాయర్‌లో నీరు ఎక్కువగా ఉండటంతో ఎగువన ఎడమ కాల్వలో 30కిలోమీటర్ల వరకు బ్యాక్‌డ్రాప్ వాటర్ చేరడంతో హాలియా నుంచి రిజర్వాయర్ వరకు ఉన్న మేజర్ల తూములను ఎత్తడంతో రెండు రోజులకు నీరు తగ్గుముఖం పట్టినట్లు పరిసర ప్రాంత ప్రజలు తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రెండు రోజుల పాటు రిజర్వాయర్ వద్ద ఉన్న ఉద్యోగులు రేయింబవళ్లు నిద్రాహారాలు మాని ఉరుకుల పరుగులతో టెన్షన్, టెన్షన్‌గా విధులు నిర్వహించారు. 2009లో భారీ వరదనీటికి పెద్దదేవులపల్లి చెరువుకట్టకు గండిపడటంతో పెద్దదేవులపల్లి, బాబసాయిపేట గ్రామాలు నీటిమునిగాయి. ప్రసుత్తం 2020 నాటి పరిస్థితులు సంభవిస్తే నాలుగు సబ్‌డివిజన్ల వారీగా జిల్లాకో సీఈలు ఉండటంతో సత్వర నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరిగితే పెద్దదేవులపల్లి, బాబసాయిపేట, తుంగపాడు శివారు ప్రాంతవాసులకు ముప్పు సంభవించే అవకాశం ఉందని ఆస్తి, ప్రాణనష్టం కూడా జరుగవచ్చన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వర్షాలు కురుస్తున్నాయంటే అధికారులు రిజర్వాయర్ వద్దే రెప్పవాల్చకుండా కాపలాకాయాల్సిందే.

### రెండేళ్లయినా పూర్తికాని మరమ్మతులు

గేట్ల మరమ్మతుల కోసం 2021లో ప్రభుత్వం టెండరు నోటీసులు జారీ చేసింది. గేట్లు తుప్పు పట్టకుండా కలర్ వేయడం, కొత్త మోటార్లు ఏర్పాటుచేయడం, గేటు రాడ్‌ల బైండింగ్‌ను సరిచేయడం, గేర్ బాక్సులు అమర్చడం, లైన్ షార్ట్‌ల ఏర్పాటు, కప్లింగ్స్, మొబైల్ జనరేటర్ ఏర్పాటు, తదితర పనుల చేయాల్సి ఉంది. 2022లో రూ.2.30 కోట్లు పనులను స్వప్న ఏజెన్సీ దక్కించుకుంది. 2023 డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా నేటికీ 40శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. గత ఏడాదిలో చేసిన పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.80 లక్షల బిల్లు మంజూరు చేయని కారణంగా డబ్బులు లేక పనులు కొనసాగించలేకపోతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాజెక్టుల గేట్ల మరమ్మతుల పనులు నిర్వహించే ఏకైక ఏజెన్సీకావడంతో మొత్తంగా రూ.80 కోట్ల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో మరమ్మతుల పనుల పూర్తి చేయలేయలేక కాలయాపన చేస్తోందన్న విమర్శలు వినవస్తున్నాయి.

### మరమ్మతుల పనులు పురోగతిలో ఉన్నాయి

పెద్దదేవులపల్లి రిజర్వాయర్ అవుట్ ఫాల్ వద్ద మరమ్మతుల పనులు పూర్తయ్యాయి. పైన మోటార్లు బిగించాల్సి ఉంది. ఇన్‌ఫాల్ గేట్ల మరమ్మతులు కాలేదు. గత డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టు ఏజెన్సీ బిల్లులు మంజూరు కాలేదని పనుల చేయడంలో జాప్యం చేస్తోంది. తిరిగి ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబరు వరకు మరమ్మతుల పనులకు గడువు పొడిగించింది.

- గోపినాథ్, డీఈ, ఎన్నెస్పీ

### నిపుణుల నియామకమేదీ?

రిజర్వాయర్‌కు ఎగువన 42.380కిలోమీటర్ వద్ద కాల్వకు రెండు ఎస్కేప్ గేట్లు, 42.400కిలోమీటర్ వద్ద ఇన్‌ఫాల్ మూడు గేట్లు, సర్‌ప్లస్ గేట్లు ఎనిమిది, 44.400 కిలోమీటర్ వద్ద అవుట్‌ఫాల్ మూడు గేట్లు మొత్తం 16 గేట్లను విద్యుత్ మోటార్ల ద్వారా డౌన్, అప్‌లు నిర్వహిస్తారు. వీటిని నియంత్రించడానికి నిపుణత కలిగిన ఉద్యోగులు కావాల్సి ఉంది. రిజర్వాయర్ నిర్మాణకాలం నుంచి ఎలక్ట్రీషన్‌ను ఎన్నెస్పీ అధికారులు నియమించలేదు. ఎమర్జెన్సీ సమయంలో సరైన టెక్నీషియన్ లేక ఖమ్మం జిల్లా పెద్దవాగు లాంటి సంఘటన చోటుచేసుకుందని, మున్ముందు అలాంటి పరిస్థితులే ఇక్కడా పునరావృతమయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. తరుచుగా ఎలుకలు ఫ్యూస్ బాక్స్‌లోని వైర్లను కొరికి వేసిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు వాపోతున్నారు. వైర్లు తెగి పవర్‌సప్లయ్ లేకపోవడంతో గేట్లను ఎత్తడం, దించడం కష్టసాధ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అడుగు పెరిగిన మూసీ నీటిమట్టం

● కొనసాగుతున్న ఇన్‌ఫ్లో ● 503.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం



వరద పెరగడంతో సూర్యాపేట జిల్లా అర్వపల్లి సమీపంలో మూసీవాగులో నీటి ఉధృతి

**కేతేపల్లి / నాగార్జున సాగర్, మేళ్లచెర్వు, జూలై 23:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ తర్వాత రెండో పెద్దదైన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 641.25 అడుగులకు చేరింది. వారం రోజులుగా హైదరాబాద్ నగరంతో పాటు మూసీ నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో ఇటీవలి వరకు 639.70అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం నాటికి అడుగు మేర పెరిగి 641.25 అడుగులుగా నమోదైంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టుకు 2235.74 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 641.25 అడుగులు (3.47టీఎంసీలు)గా ఉంది. ఇదిలా ఉంటే ఈ నెల 25నుంచి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తారన్న ఆశతో పంటల సాగుకు రైతులు ఎదురు చూస్తున్నారు. అదే విధంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, 101.57 అడుగులు (0.90 టీఎంసీలు) కాగా ఇన్‌ఫ్లో 439 క్యూసెక్కులుగా నమోదైంది. దేవరకొండలో రోజంతా చిరుజల్లులు కురిశాయి.

### 503.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా ప్రపస్తుతం 503.50 అడుగులు(120.8990 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,496 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 2,872 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేపస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 9,168 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు.

# పత్తి పంటకు జీవం పోసిన ముసురు

**చౌటుప్పల్ టౌన్, జూలై 23 :** యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ప్రాంతంలో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు పత్తి పంటకు జీవం పోసింది. ఈ ముసురుతో రైతులు ఊరట చెందారు. మండలంలో 11,500 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. మే, జూన్ మాసాల్లో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలను విత్తారు. మొలకలు వచ్చిన సమయంలో వర్షాలు లేకపోవడంతో సాగుకు తీవ్ర దెబ్బ తగిలింది. ఎండల తీవ్రతకు భూమిలోని పత్తి విత్తనాలు మాడి పోగా, భూమి పైకి వచ్చిన మొలకలు సైతం ఆరుబట్టి నేలచూపులు చూశాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో రెండు, మూడుసార్లు పత్తి విత్తనాలను రైతులు విత్తాల్సి వచ్చింది. దీంతో రైతులకు అదనంగా లక్షల రూపాయలను వెచ్చించాల్సి వచ్చింది. జూలై రెండో వారంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి పత్తి సాగుకు కొంత ఊరట కలిగింది. అయినా కూడా పత్తి సాగుకు ఆశించిన నీరు అందకపోవడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రైతులు తీవ్ర మనోవ్యధకు గురయ్యారు. వరుణుడి కరుణ కోసం నిత్యం రైతులు పత్తి చేన్లలో నిలబడి ఆకాశం వైపు చూస్తు ఎదురు చూడాల్సిన దయనీయ పరిస్థితి కొనసాగింది. అక్కడక్కడ వర్షాల కోసం జలాభిషేకాలు, కప్ప కాముడు వంటి పండుగలను సైతం నిర్వహించారు. వర్షపాతం చాల తక్కువగా ఉండడంతో పత్తి రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొనగా నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురుతో తిరిగి పత్తి సాగు చేసిన రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. ముసురు పత్తి చేలకు జీవం పోయడంతో రైతులు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు.



వరుస ముసురుతో కళకళలాడుతున్న పత్తి చేలు

### పత్తి పంటకు తెగుళ్లు సోకే సీజన్



పత్తి పంటకు తెగుళ్ల సోకే సీజన్ ఇది. ప్రధానంగా రసం పీల్చే పురుగుతో పాటు పచ్చ దోమ, తెల్ల దోమ సోకే అవకాశాలు ఉన్నాయి. తెగులు సోకిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. చేను వయస్సు దాదాపుగా నెల రోజులు దాటింది. తెగుళ్ల సోకే అవకాశాలు ఉంటాయి. మే చివరి వారం నుంచి జూన్ వరకు ఎక్కువమంది పత్తి విత్తనాలను విత్తారు. ముసురుతో భూమి బాగా తడిసినందున కలుపు మొక్కలను తొలగించాలి.

ముత్యాల నాగరాజు, ఏవో, చౌటుప్పల్

### పత్తి చేలకు ప్రాణం పోసింది

నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు పత్తి చేలకు ప్రాణం పోసింది. గత నెలలో పత్తి విత్తనాలను విత్తగా, ఎండల తీవ్రతకు అవి భూమిలోనే మాడి పోయాయి. దీంతో రెండు, మూడు సార్లు దుక్కుల్లో మళ్లీ పత్తి విత్తనాలను విత్తడంతో అదనంగా ఆర్థికభారం పడింది. లక్షల్లో అప్పులు చేసి పత్తి సాగు చేస్తున్నా. సానుకూల వర్షాలు లేకపోవడంతో పత్తి పంట పెరుగుదలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. 22 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా.

- చిదుగుళ్ల జంగయ్యగౌడ్, రైతు, ఆరెగూడెం, చౌటుప్పల్ మండలం

# కారు ఢీకొని సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి




రాజు(ఫైల్‌ఫొటో)

**కోదాడ, జూలై 23 :** కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడలో మంగళవారం జరిగింది. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన చింతా రాజు(23) సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. కోదాడలోని ఉత్తమ్‌నగర్‌లో నిర్మిస్తున్న ఇంటికి వాటర్ కొట్టేందుకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. హైదరాబాద్-విజయవాడ హైవేపై విజయవాడ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు తండ్రి చింతా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

**తిప్పర్తి, జూలై 23 :** ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామశివారులో సోమవారం జరిగింది. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన కత్తుల నర్సింహ(45) వృత్తిరీత్యా భవన నిర్మాణం సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. అందులో భాగంగా సోమవారం ఉదయం సెంట్రింగ్ పనిచేసేందుకు కూలీల కోసం తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లి గ్రామానికి తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో హ్యాపీ హోమ్స్‌కి సమీపంలోకి రాగానే బైకు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా స్థానికుల సాయంతో వెళ్లి నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. నర్సింహకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

**సూర్యాపేట క్రైం, జూలై 23 :** నిషేధిత గంజాయిని బైక్‌పై తరలిస్తున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట డీఎస్పీ జీ రవి కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సూర్యాపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మకంటి గోపి ప్లంబర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి స్నేహితుడు చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గుండు గోపి కలిసి ఆరు నెలలుగా ఒడిశా రాష్ట్రానికి వెళ్లి అక్కడ బాప అనే వ్యక్తి వద్ద గంజాయిని కిలోకు రూ.2 వేల చొప్పున కొనుగోలు చేసి బైక్‌పై అక్రమంగా వారి గ్రామాలకు తీసుకవస్తున్నారు. ఆ గంజాయిని సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అందులో భాగంగా జూన్ 29న ఇద్దరు కలిసి బాప వద్ద రెండున్నర కిలోల గంజాయిని కొనుగోలుచేశారు. దానిని బేతవోలుకు తీసుకెళ్లి అక్కడ కిలో గంజాయిని బొమ్మకంటి గోపి, కిలోన్నర గంజాయిని గుండు గోపి పంచుకున్నారు. అనంతరం బొమ్మకంటి గోపి తన గ్రామమైన మాచారం గ్రామానికి వచ్చాడు. కాగా గుండు గోపి తన వద్ద ఉన్న కిలోన్నర గంజాయిని విక్రయించేందుకు వెళ్తూ ఈ నెల 22న చిలుకూరు పోలీసులకు పట్టుబడ్డాడు. అయితే బొమ్మకంటి గోపి తన వద్ద దాచి ఉంచిన కిలో గంజాయిని సూర్యాపేటలో విక్రయించేందుకు తన బైక్‌పై గ్రామం నుంచి బయలుదేరాడు. పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామశివారులో పెన్‌పహాడ్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా అక్కడ గోపి వెళ్తున్న బైక్‌ను పోలీసులు ఆపి తనిఖీచేశారు. అందులో కిలో గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని గోపిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, పెన్‌పహాడ్ ఎస్ఐ పెరిక రవీందర్, సిబ్బంది సందీప్, రవీందర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



పేదలు, మధ్య తరగతి వర్గాలకు మేలు జరుగుతుందని బీజేపీ పేర్కొంటుంటే, రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని ఇతర పార్టీలు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న వారికే నిధులు కేటాయించారని ఆరోపిస్తున్నారు.


### పేద, మధ్య తరగతిలో వెలుగులు నింపే బడ్జెట్



కేంద్రప్రభుత్వ బడ్జెట్ అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి బాటలు వేస్తుంది. పేద, మధ్య తరగతి ప్రజల కుటుంబాల్లో వెలుగులు నింపే దిశగా ఉంది. గ్రామీణ, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పర్యాటకం, ఇందన భద్రత, నీటిపారుదల, వరదల నివారణ, ఆవిష్కరణ పరిశోధన, అభివృద్ధి, ఉపాధి, నైపుణ్యం మహిళలు, యువత సాధికారత కోసం పెద్దపీటవేశారు. ముద్ర రుణాలు రూ.20లక్షలవరకు పెంచడం హర్షణీయం. అన్నివర్గాలకు పెద్దపీట వేసినందుకు కృతజ్ఞతలు.

డా.నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు


### ● కేంద్ర బడ్జెట్ అంకెల గారడే



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అంకెల గారడిగానే ఉంది. రైతులకు మొండి చెయ్యి చూపారు.ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్. రైతు సంక్షేమం కోసం కేటాయింపులు లేకపోవడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మైనార్టీల సంక్షేమానికి కేటాయింపులు లేవు. కేంద్ర ప్రభుత్వం పడిపోకుండా ఏపీ, బీహార్ రాష్ట్రాలకు కేటాయింపులు చేశారు. తెలంగాణకు ఎలాంటి న్యాయం చేయకపోవడం ఎంతవరకు సమంజసం. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దశల వారీగా ఆందోళన చేస్తాం.

శంకర్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు నల్లగొండ

### ● తెలంగాణకు మొండి చెయ్యి



రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండటంతో పాటు ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వబడ్జెట్ రాష్ట్రానికి మొండిచెయ్యి చూపింది. కేంద్ర ప్రభుత్వానికి మద్దతిస్తున్న వివిధపార్టీలు ఉన్న రాష్ట్రాలకు మాత్రం నిధులు కేటాయించారు. ఏపీ, బీహార్ రాష్ట్రాలు బ్లాక్ మెయిలింగ్ చేస్తుండం వల్లే నిధుల కేటాయింపు చేసినట్లుగా స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రాంతాలు, రాష్ట్రాల పట్ల వివక్ష చూపిస్తోంది.

రవీంద్రకుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

### ● రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకోవాలి



కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఆదుకునేలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రైతులు, విద్యార్థులు, యువతకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలి. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులతో ఉపయోగంలేదు. పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చేలా నిర్ణయాలు ఉంటేనే ప్రయోజనం. పూర్తిస్థాయిలో శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి కోసం కేటాయింపులు ఉంటే భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూరుతోంది.

కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు

### ● ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు



పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వకపోవడం విచారకరం. రంగారెడ్డి-పాలమూరు ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వకపోవడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందనేది స్పష్టమవుతోంది. తెలంగాణ విభజన చట్టంలో రైల్వే కోచ్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ పేర్కొనకపోవడం కేంద్ర ప్రభుత్వ కపటనీతికి నిదర్శనం. తెలంగాణ వాటా తేల్చి రంగారెడ్డి-పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి.

నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

### ● తెలంగాణకు నిధులేవీ?

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి ప్రత్యేక నిధులు ఇవ్వకపోవడం బాధాకరం. రాష్ట్రం నుంచి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలున్నా ప్రత్యేకమైన నిధులు కేటాయించలేదు. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రం ఊసే ఎత్తకపోవడం విచారకరం. కేంద్ర మంత్రిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడే ఉండి కూడా నిధులు మంజూరు చేయించకపోవడం తెలంగాణ పట్ల వివక్షకు నిదర్శనం. కొత్త రైలుమార్గాలపై ఆశలు అడియాశలయ్యాయి. రాష్ట్రంలోని విద్యా, వైద్యరంగాలకు నిధులు కేటాయింపులు లేవు.

వేమూరి సత్యనారాయణ, సామాజిక కార్యకర్త, మునగాల

### ● సంచలనాలు లేని సాధారణ బడ్జెట్



కేంద్ర బడ్జెట్ సంచనాలు లేని సాధారణ బడ్జెట్. ఉన్నంతలో అందరినీ సంతృప్తి పర్చడానికి కృషి చేసినట్లుంది. ముఖ్యంగా మధ్య తరగతి, ఉద్యోగులకు, వేతన జీవులకు ఎటువంటి భారం పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. సొంత మెజార్టీ లేకపోవడంతో ప్రతిపక్షం బలంగా ఉండడం ఇతర పార్టీల మీద ఆధారపడటం అనే అంశాలు బడ్జెట్‌లో కనిపించాయి. ఇన్‌కంటాక్స్‌లో రూ.3లక్షల ఆదాయం ఉన్నవారు కూడా 5శాతం చెల్లించాలన్నది సరికాదు. ఏపీపై కొంత వరాల జల్లు కురిపించినట్లు కనిపిస్తోంది.

● పెద్దిరెడ్డి గణేష్, బ్యాంకింగ్ రంగ నిపుణులు

# పాముకాటుతో ఒడిశా కూలీ మృతి

**కట్టంగూరు, జూలై 23 :** ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కూలీ పాముకాటుతో మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలకేంద్రంలోని రాంనగర్‌లో మంగళవారం జరిగింది. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం సబరంగాపూర్ జిల్లా తారాబాం మండలంలోని తారాగావూన్ గ్రామానికి చెందిన మాన్‌సింగ్ బిందాని(26) చెల్లెలు శబిలం బిందాని మరో ముగ్గురుతో కలిసి వారం కిందట బతుకుదెరువు కోసం కట్టంగూరుకు వచ్చారు. రాంనగర్‌లోని పచ్చ రమణమ్మ ఇటుక బట్టీలో వీరంతా పనిచేస్తున్నారు. రోజు వారిగానే పనులు చేసుకుంటూ ఈ నెల 22న అందరూ కలిసి భోజనం చేసి అదే రాత్రి నేలపై పడుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున 2.30గంటల సమయంలో మాన్‌సింగ్ నిద్రలేచి తనకు పాము కర్చిందని మిగతా వారిని నిద్రలేపాడు. వెంటనే ఇటుక బట్టీల సూపర్‌వైజర్ ఉట్కూరి జలేందర్ పాముకర్చిన మాన్‌సింగ్‌ను అదేరాత్రి నల్లగొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు ఆస్పత్రికి వచ్చి తిరిగి ఇటుకబట్టీల వద్ద రూంలో విశ్రాంతి కోసం పడుకున్నారు. ఉదయం 11గంటలు అవుతున్నా మాన్‌సింగ్ ఎంతకు లేవకపోవడంతో అక్కడున్నా వారు లేపి చూసే సరికి చనిపోయిఉన్నాడు. సోదరుడు మాన్‌సింగ్ మృతిపై ఎటువంటి అనుమానం లేదని చెల్లెలు శబిలం బిందాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

# కలెక్టరేట్‌లో ఊడిపడిన సీలింగ్ షీట్లు



ఊడిపడిన సీలింగ్ షీట్లు

**సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 23 :** సూర్యాపేట సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో పైకప్పుకు ఏర్పాటుచేసిన సీలింగ్ షీట్లు ఊడిపడ్డాయి. మంగళవారం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది సీలింగ్ షీట్లు ఊడి కింద పడి ఉండడాన్ని గమనించి అధికారులకు సమాచారమిచ్చారు. కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఆడిట్‌కార్యాలయం సమీపంలోని మూత్రశాలల ప్రాంతంలో ఏర్పాటుచేసిన జిప్సమ్ షీట్లు 15 ఫీట్ల మేర ఊడిపడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం పైనుంచి నీరు గోడల వెంట లీకవుతోంది. దీంతో సీలింగ్ తడిసి ఊడిపోయిఉంటుందని భావిస్తున్నారు. సీలింగ్ షీట్లు కింద పడిన సమయంలో కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

# కుటుంబ కలహాలతో అగ్నిమాపక శాఖ అధికారి ఆత్మహత్య



రాజు(ఫైల్‌ఫొటో)

**నల్లగొండ క్రైం, జూలై 23 :** కుటుంబకలహాలతో నల్లగొండ జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి కేతారపు రాజు(36) ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామానికి చెందిన రాజు అదనపు అగ్నిమాపక అధికారిగా పనిచేస్తూ నల్లగొండలోని కాతాల్‌గూడ సమీపంలోని గ్రీన్‌సిటీలో ఉంటున్నాడు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాజు సాధారణ బదిలీల్లో భాగంగా షాద్‌నగర్ నుంచి నల్లగొండకు బదిలీపై వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం నల్లగొండ జిల్లాకు అదనపు అగ్నిమాపక అధికారి కార్యాలయంలో రిపోర్టు చేసిన అనంతరం ఇంటికి వెళ్లి క్రిమిసంహారక మందు తాగాడు. దీంతో అతడిని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం ఉదయం మృతి చెందాడు. రాజు తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా సీఐ తెలిపారు.

## దివ్యాంగులకు స్మితాసబర్వాల్ క్షమాపణలు చెప్పాలి

**చిట్యాలరూరల్, జూలై 23:** దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ క్షమాపణలు చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆల్ ఇండి యా సర్వీసులకు దివ్యాంగుల కోటా వద్దనడం సమంజసంకాదని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభను చూపుతూ ఎంతో మంది దివ్యాంగులు చరిత్ర పుటల్లో నిలిచారని, ఈ విషయాలు ఆమె మరువడం బాధాకరమన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న ఆమె సంకుచితంగా ఆలోచించడం తగదని పేర్కొన్నారు.

## హాస్టళ్లను సందర్శించిన వైద్యబృందం

**మర్రిగూడ, జూలై 23:** మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర వసతి గృహాలను వైద్య బృందం మంగళవారం పరిశీలించింది. వైద్యాధికారి డాక్టర్ సుమన్ విద్యార్థులను ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే నేరుగా విద్యార్థులు వార్డెన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## 'ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి'

**మర్రిగూడ, జూలై 23:** నాంపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. మూడు జూనియర్ కళాశాలలు ఉన్న నాంపల్లిలో ప్రతి సంవత్సరం 500 నుంచి 700 వరకు విద్యార్థులు ఇంటర్ విద్య పూర్తి చేసి పై చదువుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. కార్యక్రమంలో నాయకులు దాచేపల్లి నర్సింహ, చిరుమామిళ్ల గిరిబాబు, పోలగోని శ్రీకాంత్, వల్లపు కోటేష్, మేకల శ్రీకాంత్, మరుపాకల శివగౌడ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలు

**దేవరకొండ, జూలై 23:** సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ పోరాటాలు నిర్వహించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి వేతనాలు పెంచుతామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట్రాములు, మల్లయ్య, ప్రణయ్, తారమ్మ, రాణి, శారద, లింగమ్మ, అరుణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు నారాయణరెడ్డి

**నార్కట్‌పల్లి, జూలై 23:** స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రభారి నూకల వెంకటనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీ.వెల్లెంల ప్రాజెక్టు పూర్తి, చెర్వుగట్టు దేవస్థానంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేయాలన్నారు. మూసీ నది ప్రక్షాళన, నార్కట్‌పల్లి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు, మాండ్ర నుంచి నార్కట్‌పల్లి వరకు గల రోడ్డు నిర్మాణం జాప్యంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి, మల్లెబోయిన రమేశ్, కొర్వి శంకర్, పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేశ్, తరాల శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, మేడబోయిన శ్రీనివాస్, నోముల నాగరాజు, వడ్డేగోని రామలింగం, పంగ విజయశంకర్, ఏర్పుల లింగస్వామి పాల్గొన్నారు.

## సుంకెనపల్లి మాజీ సర్పంచ్ జంగమ్మ మృతి



**చిట్యాలరూరల్, జూలై 23:** మండలంలోని సుంకెనపల్లి మాజీ సర్పంచ్ ఆవుల జంగమ్మ(82) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. 1995-2001 సంవత్సరంలో సర్పంచ్‌గా పనిచేశారు. జంగమ్మ మృతికి సీపీఎం, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## రైతులకు సాగునీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

**చింతపల్లి, జూలై 23:** రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పీకే మల్లేపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎలాంటి ప్రణాళికలేకుండా ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, వింజమూరి అనంతలక్ష్మీ, సంబారి శంకర్, ఐతేపాక సైదులు, గనిపల్లి జితేంద్ర, శ్రీకృష్ణ, మల్లయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్ బదిలీ

**దేవరకొండ, జూలై 23:** దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్ మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జిగా డీసీహెచ్ డాక్టర్ మాత్రునాయక్ బాధ్యతలు చేపట్టారు. సూపరింటెండెంట్ రాములునాయక్‌తోపాటు పలువురు డాక్టర్లు, సిబ్బంది బదిలీ అయ్యారు.

## ముత్యాలమ్మగూడెంవాసికి డాక్టరేట్



**కట్టంగూరు, జూలై 23:** మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన సుంకరబోయిన శంకర్ పీహెచ్‌డీలో డాక్టరేట్ పొందారు. వృక్షశాస్త్రంలో చేసిన పరిశోధనకు ఉత్తరప్రదేశ్‌లోని మొనాడ్ యునివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వృక్షశాస్త్రంలో 'ఎనలైజింగ్ అండ్ ఎక్స్ ప్లోరింగ్ ద మిరియాడ్ వరల్డ్ ఆఫ్ లేపి డోప్తిరా, యాన్ ఎక్స్‌రిమెంటల్ క్వెస్ట్ ఇన్‌టూ స్పీసీస్ డైవర్సిటీ' అనే అంశంపైన డాక్టర్ దేవేంద్రకుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. శంకర్ నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.



# బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

● *డీఎంహెచ్ వో కళ్యాణ్‌చక్రవర్తి*

**నకిరేకల్, జూలై 23:** మండలంలోని మంగళపల్లి గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ వో కళ్యాణ్‌చక్రవర్తి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళపల్లి గ్రామంలో పలు వీధుల్లో మంగళవారం పర్యటించి జ్వరాల బారిన పడిన బాధితుల వివరాలు సేకరించారు. మురుగునీరు లేకుండా పరిశుభ్రంగా గ్రామాన్ని ఉంచుకునేందుకు సత్వరమే దోమల మందు పిచికారీ చేయాలని గ్రామ కార్యదర్శి రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. గ్రామంలో జ్వరాల బారిన పడిన బాధితుల సంఖ్య తగ్గించేందుకు గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న 87మందిని వైద్య సిబ్బంది పరిశీలించి వారి నుంచి రక్త నమూనాలు సేకరించి నల్లగొండ ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డీఎంవో దుర్గయ్య, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్. కిరణ్‌కుమార్, ఎంపీవో పరమేష్, ఓగోడు పీహెచ్‌సీ వైద్య అధికారి యోగస్వీ, సీహెచ్‌వో సునంద, హెచ్ఈ వోలు రాపోలు రవి, నర్సింహ్మాచారి పాల్గొన్నారు.

**గుర్రంపోడు:** వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ వివరాలు, గర్భిణులకు అందుతున్న సదుపాయాలు, డయాబెటిస్, బీపీ తదితర వ్యాధులకు అందుతున్న చికిత్స, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో మంజుల, వైద్యాధికారి భవాని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మంగళపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళ్యాణ్ చక్రవర్తి

**కేతేపల్లి:** గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డి. నాగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వేయడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలను నివారించి పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. రైతు రుణమాఫీపై రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కారమయ్యేలా చూడాలని వ్యవసాయ అధికారి బి. పురుషోత్తంను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో బి. శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, ఎంపీవో జి. నాగలక్ష్మి, ఏపీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపోడులో మందులు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు

# సాగర్‌లో గుప్తనిధుల కోసం తవ్వకాలు

*10 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు*

**నాగార్జునసాగర్, జూలై 23:** గుప్తనిధులు ఉన్నాయని ఓ వ్యక్తి తన ఇంట్లో తవ్వకాలు చేపట్టాడు. ఈ నెల 21వ తేదీ ఆదివారం పౌర్ణమి కావడంతో ఆ రోజు నుంచి మూడు రోజులుగా తవ్వకాలు చేస్తున్నాడు. సాగర్ ఎస్ఐ సంపత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సాగర్ పైలాన్‌కాలనీ ఎస్‌బీఐ వెనకాల వైజాక్ నుంచి వచ్చి స్థిర పడ్డ మత్స్యకారుల కాలనీలో కొడ మల్లి, కొడ శ్రీను, కొడ సత్తి, కొడ నాగు అనే నలుగురు అన్నదమ్ములు ఉంటున్నారు. ఆ నలుగురు తమ ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయని హైదరాబాద్ నుంచి వైబ్రేషన్ మిషన్‌లు(స్లాబ్‌లు, కాంక్రీట్‌గోడలు కూల్చే మిషన్లు) తీసుకువచ్చి ఆదివారం నుంచి ఇంట్లో తవ్వకాలు చేపట్టారు. చుట్టుపక్కల వారు తవ్వకాల శబ్దాలు విని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో మంగళవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని మల్లి ఇంటిని పరిశీలించారు. అక్కడ తవ్వకాలకు ఉపయోగించిన మిషన్లు స్వాధీనం చేసుకుని నలుగురు అన్నదమ్ములతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన మరో నలుగురు వ్యక్తులను, పనిచేస్తున్న మరో ఇద్దరిని 10మందిని అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా కొడ మల్లి మాట్లాడుతూ ఐదారు నెలలుగా తమ ఇంట్లో గజ్జల శబ్ధం వస్తుందని, దీంతో భయంతో ఇంటికి తాళం వేసి హిల్‌కాలనీలో ఇంట్లో అద్దెకు ఉంటున్నామన్నారు. కలలో ఎల్లమ్మ దేవత ఇంట్లో ఉందని దేవత విగ్రహం ఇంటి అడుగున భూగర్భంలో ఉందని చెప్పడంతో అమ్మవారిని బయటకు తీసి పూజలు చేసేందుకు తవ్వకాలు చేస్తున్నామన్నారు. మల్లి అన్నదమ్ములు మాత్రం ఇంట్లో బాత్రూం కట్టడానికి గుంత తవ్వుతున్నామని చెబుతున్నారు.



తవ్వకాలు జరిగిన ప్రదేశం

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**చింతపల్లి, జూలై 23:** చింతపల్లి మండలం వేంకటేశ్వరనగర్‌లో చోరీ జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేంకటేశ్వర్‌నగర్‌కు చెందిన మల్లోజు విష్ణు దేవరకొండ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం దేవరకొండకు వెళ్లారు. సోమవారం భార్య ఇంటికి తాళం వేసి ఆమె కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి వేళలో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు తులం బంగారం, 12 తులాల వెండి ఆభరణాలను చోరీ చేశారు. అదేవిధంగా కాలనీలోని చేపూరి బ్రహ్మాచారి, నయనచారి ఇళ్లలోకి చొరబడ్డారు. గమనించిన ఇంటి యజమానులు కేకలు వేయడంతో పరారయ్యారు. మంగళవారం ఉదయం విష్ణుమూర్తి విధులు ముగించుకుని ఇంటికి రావడంతో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించాడు. విష్ణు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

**నార్కట్‌పల్లి, జూలై 23:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం విచాకరమన్నారు. మంగళవారం నార్కట్‌పల్లిలో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకపోవడం సవతి తల్లి ప్రేమలాంటిదేనన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, వెంపటి శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

**నల్లగొండ క్రైం, జూలై 23:** మొక్కలు నాటి సంరక్షించాలని తెలంగాణ స్పెషల్ పోలీస్ అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ అన్నారు. అన్నెపర్తిలోని 12వ బెటాలియన్ అవరణలో మంగళవారం మొక్కలు నాటారు. అనంతరం బెటాలియన్ సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ఎన్‌వీ సత్యశ్రీనివాస్‌రావు, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అసిస్టెంట్ కమాండెంట్ సీహెచ్ అంజనేయరెడ్డి, కేవీ రవిచంద్ర, ఎం వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కళాశాలల్లో సదుపాయాలు కల్పించాలి

**హాలియా, జూలై 23:** ప్రభుత్వ కళాశాలల్లో సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హాలియా ప్రభుత్వ కళాశాలలో సర్వే నిర్వహించారు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్షిత్, చందు, జానీ, స్వప్న, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**శాలిగౌరారం, జూలై 23:** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలిగౌ రారంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్, కస్తూర్బా గురుకుల పాఠశాల, జడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నేతలు వేముల భరత్ రాజ్, మిర్యాల సాయి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, నాయకులు బండపెల్లి కొమరయ్యా గౌడ్, చింత ధనుంజయ్, షేక్ ఇంతియాజ్ అహ్మద్, చాడ సురేష్ రెడ్డి, చామల మహేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, కట్టగూరి సురేందర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వడ్లకొండ పరమేష్ గౌడ్, బెల్లి వీరభద్రం, తీరుపారి మల్లేష్, గూని వెంకటయ్య, బండారు మల్లయ్య, నరిగే నర్సింహ, లోడంగి మహేష్, పాకల సతీష్, పెరుమాండ్ల నరేష్, సుల్తాన్, యల్లయ్య, వేముల గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

**కట్టంగూరు:** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్ది సుక్కయ్య, మాద యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, సత్తయ్య, శివశంకర్, మర్రి రాజు, అయితగోని నర్సింహ్మ, కుంభం అనిల్ రెడ్డి, రెడ్డిపల్లి వీరస్వామి, నిమ్మల సత్యనారాయణ, కొంపల్లి యాదయ్య, గుండు శేఖర్, మాదగోని వెంకన్న, ముక్కమాల శేఖర్, దశరథ, గోపి, లింగయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

**చిట్యాలరూరల్:** భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఆయనను చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన కాంగ్రెస్ జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి అరూరి శ్రీశైలం శనివారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డికి శ్రీశైలం పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిని కలిసిన వారిలో వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, విక్రమ్ తదితరులు ఉన్నారు.



శాలిగౌరారంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



**పెద్దఅడిశర్లపల్లి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతో సాధ్యమని సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీఎస్ ఫణికుమార్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తరల పరమేష్‌యాదవ్, మూనా, సట్టు గోపి, వసికర్ల రమేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజి ఉద్యావన పరిశోధన కేంద్రంలో బత్తాయి, నిమ్మ మొక్కలు అందుబాటులో ఉన్నట్లు ఉద్యావన పరిశోధకులు డాక్టర్ రాజాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాత్పుడి రంగాపూరి, నిమ్మ అంటపై అంటుకట్టిన బత్తాయి మొక్కలు 15వేల మొక్కలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

**కొండమల్లేపల్లి:** మండలకేంద్రంలోని సోలిడార్ బధిరుల పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ, లయన్స్ క్లబ్ ఆప్ సహస్ర ఆధ్వర్యంలో జెడ్‌సీ వనం భిక్షమయ్య, మణెమ్మ దంపతుల కుమార్తె విపూరి మమత, అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి రూ.8వేల విలువైన ఇడ్లీ కుక్కర్, మిక్సర్ గ్రైండర్‌లను బహూకరించారు. కార్యక్రమంలో సహస్ర క్లబ్ ప్రెసిడెంట్ శివపార్వతి, సత్యనారాయణ, వనం శ్రీను, వనం మణెమ్మ, చేరుపల్లి జయలక్ష్మి, సముద్రాల ప్రభాకర్, చిలుకూరి నిరంజన్, కుంచకూరి లక్ష్మణ్, లకుమారపు మల్లయ్య, సిరందాసు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం..

**కొండమల్లేపల్లి:** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మైదానంలో విద్యార్థులతో మట్టి మోయించిన హెచ్ఎంను సస్పెండ్ చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు ఎంపీడీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులతో మట్టిని మోయించిన విషయమై ఏబీవీపీ నాయకులు హెచ్ఎంను ప్రశ్నించగా దుర్భాషాడినట్లు ఏబీవీపీ నాయకులు ఆరోపించారు.


**మాడ్గులపల్లి:** సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల వెంకన్న, అర్రూరి నరేష్, కోడూరు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవూర:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీరబాబు అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాగృతి పోలీస్ కళాబృందం కళాకారులచే నూతన చట్టాలపై, మహిళలపై జరుగుతున్న వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మొబైల్‌లో కాలక్షేపం చేస్తూ చెడు వ్యసనాల బారిన పడకుండా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచిగా చదువుకోని భవిష్యత్తులో గొప్పవారు కావాలన్నారు. మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరం శిక్షలు తప్పవని హెచ్చరించారు.

**చిట్యాలరూరల్:** మండలంలోని వట్టిమర్తిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అక్షర మాల చార్ట్‌లను అందజేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మహనీయుల జీవిత చరిత్రను అవగతం చేసుకోవాలని ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జానకి, ఉపాధ్యాయులు సరస్వతి, భారతి, విమల, పవన్ పాల్గొన్నారు.

**దేవరకొండ:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఆరేకంటి యేసయ్య, ఉపాధ్యక్షులు ఎర్ర అంజనేయులు అన్నారు. దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నీలిమాకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. అంబేద్కర్ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాజ్యాంగాన్ని నిర్మించి చట్టాలను అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరంజన్, రవీందర్, శీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**చండూరు రూరల్:** మండలంలోని బంగారుగడ్డ గ్రామానికి చెందిన నలపరాజు చిన్న లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. బంగారుగడ్డ సీపీఐ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.22వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్న లింగయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య, నాయకులు పల్లె యాదయ్య, మాజీ సర్పంచ్ బోయపల్లి భిక్షమయ్య, కర్నాటి వెంకటేశం, పల్లె నర్సింహ, పల్లె శంకరయ్య, జక్కలి పరమేష్, తలారి ముత్తయ్య, కాటపల్లి శ్రీను, సుంకరి లింగంగౌడ్, కొండ్రెడ్డి రమేష్, సాయికుమార్, దశరథ, శివ పాల్గొన్నారు.



**మిర్యాలగూడ టౌన్:** బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన దాయం భరత్‌రెడ్డి నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఏబీవీపీ, బీజేవైఎం తదితర విభాగాల్లో సేవలందించిన భరత్‌రెడ్డిని జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడంపట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

**మిర్యాలగూడ టౌన్:** పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో నూతనంగా వచ్చిన ఉద్యోగులు విధుల్లో చేరారు. కార్యాలయంలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు బదిలీ కావడంతో ఆయా స్థానాల్లోకి నూతనంగా వచ్చిన ఉద్యోగులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రెవిన్యూ అధికారి జిల్లేపల్లి జ్ఞానేశ్వరి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ దండు శ్రీనుతో పాటు మరో 11 మంది ఉద్యోగులు విధుల్లో చేరారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

**మిర్యాలగూడ టౌన్, జూలై 23:** ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు పోరాడతామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ అర్హులైన రైతులకు అందలేదన్నారు. కాంగ్రెస్ విధానాలతో అనతి కాలంలోనే విసుగు చెందుతున్న ప్రజలు బీజేపీ వైపుకు మొగ్గు చూపుతున్నారని, అందుకు ఉదాహరణ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకంటే బీజేపీకే అధిక ఓట్లు రావడమేనన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, రేపాల పురుషోత్తంరెడ్డి, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కొండేటి సరితశేఖర్, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## భూమి ఆక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి

**చింతపల్లి, జూలై 23:** మండలంలోని సర్వే నెంబర్ 154ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని వారిపై చర్య తీసుకోవాలని మంగళవారం నల్లగొండలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు, విక్రయాలు జరుగుతున్నాయని, హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులతో ఇష్టారాజ్యంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వర్కాల గ్రామంలో సర్వేనెంబర్ 173లో లావుణ్యపట్టా భూమి ఉండగా ఒక్క గుంట భూమి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు చెల్లించి గోదాం నిర్మించుకున్నారన్నారు. కార్యక్రమంలో నర్సింహ, కె. అబ్బయ్య, యాదగిరి, శివ పాల్గొన్నారు.

## బిక్షంరెడ్డి మృతి బాధాకరం

**పెద్దఅడిశర్లపల్లి, జూలై 23:** యోల్గురి బిక్షంరెడ్డి మృతి బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గుడిపల్లి మండలంలోని జి.భీమనపల్లి గ్రామంలో బిక్షంరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమ ంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యోల్గురి వల్లపురెడ్డి, మునగాల అంజిరెడ్డి, మాద సుధాకర్‌గౌడ్, మల్లయ్య, నర్సింహ, కృష్ణ, తులసీరాం ఉన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

**శాలిగౌరారం, జూలై 23:** ప్రమాదవశాత్తు తెగిన విద్యుత్ తీగలు తగిలి పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన శాలిగౌరారం గ్రామశివారులో మంగళవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం గ్రామానికి చెందిన శేషబట్టర్ నర్సింహాచార్యులు పాడి గేదె ఆకారం రోడ్డులో వైకుంఠదామం వద్ద మేత మేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన పాడి గేదె విలువ దాదాపు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు నర్సింహాచార్యులు తెలిపారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

## గీత కార్మికుడికి తీవ్రగాయాలు

**కట్టంగూరు, జూలై 23:** తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కట్టంగూరు మండలం కురమర్తి గ్రామంలో మంగళవారం జరిగింది. అదే గ్రామానికి చెందిన చెనగోని నాగయ్య అనే గీత కార్మికుడు రోజు వారీగానే తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పైనుంచి కింద పడటంతో గాయాలయ్యాయి.

## నేడు నాంపల్లిలో విద్యుత్ గ్రీవెన్స్‌డే

**గుర్రంపోడు, జూలై 23:** విద్యుత్ వినియోగదారుల సమస్యలపై నాంపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈ నెల 24న సీజీఆర్ఎఫ్ (కంజ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రాసెల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యుత్ గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు ఏడీఈ సాగర్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికి హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు రశీదు, పట్టాదారు పాస్ పుస్తకం జీరాక్స్ తీసుకుని రావాలని కోరారు. ఈ నెల 24న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాంపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని నాంపల్లి, గుర్రంపోడు, చింతపల్లి, మర్రిగూడ మండలాల విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని కోరారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

**నల్లగొండ రూరల్, జూలై 23:** ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పన్నుల వసులు, తదితర పనులు చేస్తున్నారన్నారు. హామీలపై బడ్జెట్ శాసనసభ సమావేశాల్లో ప్రకటన చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పొతేపాక వినోద్, సైదులు, సత్యనారాయణ, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్‌తో పనిచేయిస్తున్నందుకు..

**చింతపల్లి, జూలై 23:** మండలంలోని వేంకటేశ్వరనగర్‌లో మైనర్‌తో పనిచేయిస్తున్న రక్షిత బైక్‌పాయింట్ శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా కులకులపల్లి గ్రామానికి చెందిన అయిన కట్టి శ్రీశైలం కొంతకాలంగా తన బైక్‌పాయింట్‌లో మైనర్ బాలుడిని పనిలో పెట్టుకున్నాడు. దేవరకొండ ఆపరేషన్ ముస్కాన్ వారి నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుండగా బైక్ పాయింట్ షాపులో మైనర్ బాలుడు పనిచేస్తున్న సమాచారం తెలుసుకుని విచారించారు. శ్రీశైలంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.